రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

సీసీసీ నస్పూర్, జనవరి 4: సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి యువ కార్మికుడు గడికొప్పుల రాజేశ్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ నెల్కి సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం..నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని తీగల్‌పహాడ్, అల్లూరి సీతారామరాజు నగర్‌కు చెందిన గడికొప్పుల ఇసయ్య పెద్ద కొడుకు అయిన గడికొప్పుల రాజేశ్ శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే-6గనిలో పనిచేస్తున్నాడు. ఈ నెల 3న సాయంత్రం బెల్లంపల్లి సమీపంలో ఉండే తన స్నేహితుడి వద్దకు తన ద్విచక్ర వాహనంపై (ఏపీ 01ఏఎఫ్-3226) వెళ్లాడు. తిరిగి ఇంటికి వస్తుండగా అర్ధరాత్రి సమయంలో నస్పూర్ ఎన్‌హెచ్-363 ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు వద్ద తన బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న కాలువలో పడిపోయాడు. ఈ ప్రమాదంలో రాజేశ్ తలకు బండరాయి బలంగా తగలడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు శనివారం ఉదయం ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి గడికొప్పుల ఇసయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అంబులెన్స్, బైక్ ఢీ

బెజ్జూర్, జనవరి 4 : మండలంలోని ఎటిగూడ సమీపంలోని మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదంతో ఇద్దరికి గాయాలయ్యాయి. శనివారం మండలంలోని తలాయి గ్రామానికి చెందిన పానెం భీమయ్య తన బైకుపై అదే గ్రామానికి చెందిన ఆత్రం నీలయ్యతో కలిసి బైకుపై బెజ్జూర్‌కు వెళ్తున్నారు. వీరికి ఎదురుగా 102 అంబులెన్స్ తలాయికి వెళ్తుండగా ఎటిగూడ సమీపంలోని మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. బైకుపై ఉన్న నీలయ్యకు కుడి కాలు విరిగగా భీమయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని సర్కారు దవాఖానకు గ్రామస్తులు తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ దవాఖానకు తరలించారు.

దుప్పట్లు పంపిణీ

కాసిపేట, జనవరి 4 :మండలంలోని లంబాడీతాండ(డీ)లో సాంక్లి బాయి, రాజేశం జ్ఞాపకార్థం వారి కుమారుడు అజ్మీరా దేవ్ సింగ్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో రత్నం ప్రదీప్, రాజమౌళి, చెనవేని పౌలు, మాజీ సర్పంచ్ రవి, భీమ్ నాయక్, గజానంద్ తదితరులున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

I, **PADGELWAR PRAVEEN** (Old name) S/o. **PADGELWAR VISHWANATH** R/o. H.No.3-9-129, Brahmanwada, Adilabad, is hereby Change my name as **"PADIGELA PRAVEEN"** (New name) and Spouse Name **"PADIGELA VARSHA"** as per all Document Proofs, Holding Passport No. **G0774736,** Dt. 15-11-2006 to 14-11-2016, issued at Hyderabad Hence declared.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

ఖైరతాబాద్: 91827 77671, 91827 77677

దళిత సంఘాల ఐక్యవేదిక కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి, జనవరి 4 : తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ అధికార ప్రతినిధిగా ఆసాది మధు, ఉపాధ్యక్షుడిగా దాసరి బానయ్య ఎన్నికయ్యారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఎన్నుకున్న కమిటీ సభ్యులకు పట్టణ అధ్యక్షుడు కుంభాల రాజేశ్ నియామకపత్రాలను అందించారు. ప్రధాన కార్యదర్శిగా రత్నం ఐలయ్య, కోశాధికారిగా గొడిసెల శ్రీహరి, ఉపాధ్యక్షుడిగా చంద్రమౌళి, కార్యదర్శులుగా చంద్రశేఖర్, సురేశ్, ప్రచార కార్యదర్శులుగా రవిరాజ్, రవి, గౌరవ సభ్యులుగా తిరుపతి, రామస్వామి, రామకృష్ణ, సుభాష్, చక్రధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు విద్యాభారతి విద్యార్థిని

తాండూర్: విద్యార్థినితో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

తాండూర్, జనవరి 4 : ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు జరగనున్న జాతీయస్థాయి సెపక్ తక్రా క్రీడా పోటీలకు మండల కేంద్రంలోని విద్యాభారతి పాఠశాల విద్యార్థిని కే శ్రీస్ఫూర్తికారుణ్య ఎన్నికైనట్లు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్‌కుమార్ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో విద్యార్థినిని అభినందించి రూ.5,000 నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్ సరోజిని, పీఈటీలు, సిబ్బంది పాల్గొని విద్యార్థినిని అభినందించారు.

ఆక్రమణల తొలగింపు పనుల పరిశీలన

మంచిర్యాలటౌన్, జనవరి 4: మంచిర్యాలలోని మార్కెట్‌రోడ్, గంగారెడ్డి రోడ్, ఆర్‌పీరోడ్‌లలో ఆక్రమణల తొలగింపు ప్రక్రియను శనివారం ఎమ్మెల్యే కే ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. అంతకుముందు పట్టణంలోని గోదావరి తీరంలో నిర్మిస్తున్న వైకుంఠధామం పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, పబ్లిక్ హెల్త్ ఈఈ గంగాధర్, మున్సిపల్ ఇంజనీర్ మసూద్‌అలీ, ఏఈ రాజేందర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు ఉన్నారు.

సీసీ రోడ్డు, సైడ్ డ్రెయిన్ పనులకు భూమిపూజ

జైపూర్, జనవరి 4: ఇందారం దొరగారిపల్లెలో సీసీ రోడ్డు, డ్రైన్ పనులకు స్థానిక నాయకులతో కలిసి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి భూమిపూజ చేశారు. ముదిగుంట గ్రామంలో సీసీ రోడ్డు, సైడ్ డ్రైయిన్ పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఫయాజ్, మండల ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

చెన్నూర్, జనవరి 4: చెన్నూర్ పట్టణంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో రూ 60 లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులకు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను నాయకులతో కలిసి పంపిణీ చేశారు.

బేస్ క్యాంప్ సిబ్బందికి బ్యాగుల పంపిణీ

జన్నారం, జనవరి 4 : డివిజన్‌లో పని చేస్తున్న బేస్ కాంప్, యానిమల్ ట్రాకర్లకు వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్(డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్) హైదరాబాద్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులను రేంజ్ ఆఫీసర్ సుష్మారావు పంపిణీ చేశారు.

నేడు జన్నారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

జన్నారం, జనవరి 4 : జన్నారంలోని మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం మార్కెల్ కమిటీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిటీ అధ్యక్షుడు దుర్గం లక్ష్మీనారాయణ తెలిపారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా సయ్య ద్ ఫసి ఉల్లా, డైరెక్టర్లుగా బీనవేణి రాజన్నయాదవ్(అక్కపెల్లిగూడ), ఏ లావణ్య, ఎల్ తిరుపతి, పీ సోనేరావు, పీ లావణ్య, ఎ నర్సయ్య, ఆర్ ప్ర దీపం, ఎం రాజన్న, బీ సత్తయ్య, జీ సత్యగౌడ్ ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

వంట మనిషిని తొలగించాలని వినతి

మంచిర్యాలటౌన్, జనవరి 4: మంచిర్యాల పట్టణంలోని అండాళమ్మ కాలనీలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజన వంట మనిషి బత్తుల పద్మను వెంటనే తొలగించాలని కోరుతూ శనివారం డీఈవో యాదయ్యకు అండాళమ్మ కాలనీ వాసులతో పాటు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. వంటమనిషి పిల్లలకు సరైన భోజనం పెట్టడం లేదని, ప్రశ్నించిన తల్లిదండ్రులపై దురుసుగా వ్యవహరిస్తున్నదని, దూషిస్తున్నదని చెప్పారు. పాఠశాల కరెంటును తన సొంత అవసరాలకు వాడుకుంటున్నదని, ఇంటికి వెళ్లేందుకోసం పాఠశాల గోడను కూల్చిందని, రెండు నెలల కితం కొత్తగా వచ్చిన టీచర్‌ను కూడా తాను చెప్పినట్లు వినాలని బెదిరిస్తునదన్నారు. అండాళమ్మకాలనీ వాసులందరం కలిసి వంటమనిషి దురాగతాలను ప్రశ్నిస్తే తమపై కూడా దురుసుగా ప్రవర్తించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి కిషన్, నాంపల్లి శ్రీనివాస్, వార్డు ప్రజలు సుజాత, మానస, స్వప్న, వెంకటేశ్, తిరుపతి, శంకర్, సతీశ్, ఖాలిద్, తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో పత్తి కి నిప్పు

నెన్నెల, జనవరి 4 : మండలంలోని కోణంపేట గ్రామానికి చెందిన డోలే తిరుపతి తన ఇంటిలో నిల్వ చేసి ఉన్న పత్తికి తాగిన మైకంలో నిప్పు పెట్టాడు. శనివారం సాయత్రం మద్యం తాగి ఇంటిలో తల్లితో గొడవ పెట్టుకున్న తిరుపతి తాగిన మైకంలో ఇంటిలో ఉన్న పత్తి కుప్పకు నిప్పు పెట్టి పారిపోయాడు. గమనించిన చుట్టు పక్కల వాళ్లు మంటలు ఆర్పివేశారు. అనంతరం బ్లెలంపల్లి నుంచి ఫైరింజన్ వచ్చి పెద్ద ప్రమాదం జరగకుండా మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో దాదాపు 5 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైనట్లు గ్రామస్తులు తెలిపారు.

రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించండి

రోడ్డుపై ఇసుక కుప్పన తప్పించబోయి మురుగు కాలువలో దిగబడిన ఆటో

చెన్నూర్, జనవరి 4: రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించి, తమను ప్రమాదాల బారి నుంచి కాపాడాలని బలిజెవాడ కాలనీ ప్రజలు కోరుతున్నారు. చెన్నూర్ పట్టణంలోని బలిజెవాడలో ఇటీవల సిమెంటు రోడ్డును నిర్మించారు. రోడ్డు నిర్మాణం పనుల కోసం సంబంధిత కాంట్రాక్టరు అవసరమైన ఇసుకను నడి రోడ్డుపై పోశాడు. రోడ్డు పనులు పూర్తైపది రోజులైనా కాంట్రాక్టరు తొలగించ లేదు. అసలే ఇరుకు రోడ్డు మధ్యలో ఇసుక కుప్ప ఉండడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రెండు రోజుల క్రితం పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో ఇసుక కుప్పను తప్పించబోయి అదుపుతప్పి మురుగు కాలువలో పడి పోయింది. శనివారం ప్రయాణికులతో వెళ్తున్న మరో ఆటో అదుపు తప్పి మురుగు కాలువలో పడిపోయింది. ద్విచక్ర వాహనాలు ఇసుకలో కూరుకపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న ఇసుకను తొలగించాలని ఆ వార్డు ప్రజలు కోరుతున్నారు.

దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్
- ఘనంగా లూయిస్ బ్రెయిలీ 216 జయంతి

మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్

హాజీపూర్, జనవరి 4 : ఎందరో దివ్యాంగులు తమ వైకల్యాన్ని అధిగమించి తాము ఎంచుకున్న రంగాల్లో విజయం సాధించారని, వారిని ఆదర్శంగా తీసుకొని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ సూచించారు. శనివారం లూయిస్ బ్రెయిలి 216 జయంతిని పురస్కరించుకొని నస్పూర్‌లో కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా సంక్షేమ అధికారి రవూఫ్‌ఖాన్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రజ్‌వీరుతో కలిసి హాజరై అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలి అందించిన బ్రెయిలి లిపి ద్వార ఎంతో మంది అంధులు ఉన్నత స్థానాల్లో నిలిచారన్నారు. వైకల్యం అనేది శరీరానికి మాత్రమే నని, మనస్సుకు, ఆలోచనకు కాదని, పిల్లలు అందరు కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

దండేపల్లి, జనవరి4: దండేపల్లి మండలంలోని గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధుల చదువుల కొరకు బ్రెయిలీ లిపిని కనిపెట్టిన బ్రెయిలీ కృషిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ స్వరూప, ఉపాధ్యాయులు ఉన్నారు.

దండేపల్లి : చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, హెచ్ఎం

రోడ్డు భద్రతా మాసోత్సవాలపై సమీక్ష

వీసీలోపాల్గొన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్/ ఆసిఫాబాద్ టౌన్, జనవరి 4 : రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈ నేపథ్యంలో రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, అధికారులతో కలిసి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, రవాణా శాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, విద్యాశాఖ అధికారులతో రహదారి భద్రత మాసోత్సవాల నిర్వాహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ నెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికీ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించేలా చూడాలని సూచించారు. కలెక్టర్లు మాట్లాడుతూ రహదారి భద్రతా మాసోత్సవాలను జిల్లాలో విజయవంతం చేసే దిశగా అధికారుల సమన్వయంతో కృషి చేస్తామని తెలిపారు. మంచిర్యాల కలెక్టరేట్ నుంచి కుమార్ దీపక్, ఏసీపీ ప్రకాశ్, జిల్లా రవాణా అధికారి సంతోష్‌కుమార్, రోడ్డు భవనాల శాఖ అధికారి రాము, డీఈవో యాదయ్య, అధికారులు రాజేశ్వరి, పురుషోత్తం నాయక్ తదితరులు పాల్గొన్నారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీటీవో రామ్ చందర్, రోడ్డు భవనాల శాఖ అధికారి సురేందర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, షెడ్యూల్డ్ కులాల ఉపసంచాలకులు సజీవన్, ఆర్టీసీ అధికారులు, విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులుపాల్గొన్నారు.

యూత్ ఫెస్టివల్ విజేతలు రిపోర్టు చేయాలి

నస్పూర్, జనవరి 4 : జిల్లాలో నిర్వహించిన యూత్ ఫెస్టివల్‌లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈ నెల 6న ఉదయం 4 గంటలకు మంచిర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో రిపోర్టు చేయాలని జిల్లాయువజన క్రీడా శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9963539234లోసంప్రదించాలని సూచించారు.

మొక్కలను సంరక్షించాలి

నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో కిషన్

వేమనపల్లి, జనవరి 4 : నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని డీఆర్డీవో కిషన్ సూచించారు. శనివారం కేతనపల్లి, ముల్కలపేట, నీల్వాయి గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. మొక్కల పెంపకం, సంరక్షణపై పలు సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా అటవీ ప్రాంతంలో ఫాంపాండ్ నిర్మాణ పనులను పరిశీలించారు. జాబ్ కార్డు కలిగిన కూలీలం దరూ వంద రోజులు పని పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం ముల్కలపేటలో ఇందిరాక్రాంతి పథకంలో మంజూరైన నాటుకోళ్ల పెంపకం కేంద్రాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీవో సత్య ప్రసాద్, ఏపీఎం ఉమారాణి, ఈసీ మధుకర్, పంచాయతీ కార్యదర్శులు జాఫర్, అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి, జనవరి 4 : ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో కిషన్ కోరారు. కోటపల్లి మండలంలోని మల్లంపేట, సర్వాయిపేటలో ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్డీవో పరిశీలించారు. ఉపాధి హామీ ద్వారా పశువుల పాకల నిర్మాణం, అజోలా పెంపకం, నర్సరీల పెంపకం చేపట్టనున్నట్లు వివరించారు. కూలీలకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నర్సరీల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఏపీవో వెంకటేశ్వర్లు, ఈసీ నాగేందర్, పంచాయతీ కార్యదర్శి శ్రీవిద్య, శంకర్, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

రికార్డులు తనిఖీ చేస్తున్నా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, జనవరి 4: పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. శనివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మధ్యాహ్న భోజన నాణ్యత, రిజిస్టర్‌లను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులకు గణితంలో ప్రశ్నలు వేసి వారి పఠన సామర్థ్యాలను పరీక్షించారు. గడువులోగా సిలబస్ పూర్తి చేసి వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలతో భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర రూ.50 తగ్గింపు

జైనూర్ , జనవరి 4 : జైనూర్ మార్కెట్ పరిధిలోని రెండు జినింగ్ మిల్లులో సీసీఐ మద్దతు ధర రూ.50 తగ్గించినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇర్ఫాన్ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు. రెండు మిల్లులో కొనుగోళ్లు చేస్తున్న పత్తి రెండు మూడవసారి తీసిన పత్తి తీసుకురావడంతో నాణ్యత తగ్గి పత్తి పింజ పొడవు తక్కువగా ఉండడం వల్ల సీసీఐ అధికారులు క్వింటాల్‌కు రూ.50 తగ్గించి 8 తేమశాతం ఉన్న పత్తికి ధర 7421 గా నిర్ణయించారని రైతులు సహకరించాలని కోరారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

దండేపల్లి, జనవరి4: దండేపల్లి మండలంలోని వెల్గనూర్‌కు చెందిన మెండె మహేశ్(24) కడుపునొప్పి భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ ఉదయ్‌కిరణ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..మహేశ్ రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు.ఆర్థిక స్థోమత లేక మెరుగైన చికిత్స పొందలేదు. శుక్రవారం సాయంత్రం కడుపునొప్పి తీవ్రమవడంతో జీవితంపై విరక్తి చెంది స్థానిక జీపీ కార్యాలయం దగ్గర పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న మహేశ్‌ను లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మంచిర్యాలకు ఆ తర్వాత వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలో సుల్తానాబాద్ వద్ద మృతిచెందాడు. తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అక్రమ పట్టాలు చేసుకున్నారు

- గురువాపూర్ ఆదివాసీ గిరిజనుల ఆరోపణ

మాట్లాడుతున్న గురువాపూర్ ఆదివాసీ గిరిజనులు

కాసిపేట, జనవరి 4 : కాసిపేట మండలంలోని గురువాపూర్‌లో ఆదివాసీ గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములను అక్రమ పట్టాలు చేసుకొని ఆదివాసీ గిరిజనులపై దాడులు చేస్తున్నారని గురువాపూర్ ఆదివాసీ గిరిజనులు కుర్సింగ మోహన్, ఆత్రం మహదు, ఆడే నగేశ్, కుర్సింగ కేశవరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం కాసిపేట మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గురువాపూర్ ఆదివాసీ గిరిజనులు మాట్లాడారు. కాసిపేట మండలం ముత్యంపల్లిలోని గురువాపూర్ 74 /1, 74/2 సర్వే నెంబర్ లో గల భూములను ఇనిగంటి సత్యనారాయణ, వీర్ల సుధాకర్ అనే వ్యక్తులు అక్రమంగా పట్టాలు చేసుకున్నారని ఆరోపించారు. దశాబ్దాలుగా 1920 నుంచి సాగు చేసుకుంటున్నామని, 1955 నుంచి కాస్తులో ఉంటూ ఇప్పటికీ సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ భూమి ఇవ్వాలంటూ ఇనిగంటి సత్యనారాయణ, వీర్ల సుధాకర్ తమపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వీరి పట్టాలను రద్దు చేసి తమను న్యాయం చేయాలని అధికారులను కోరారు.

వాహనాల వేగానికి స్పీడ్ గన్స్ తో చెక్

- రామగుండం సీపీ శ్రీనివాస్
- '2024' లో స్పీడ్ గన్ తో 7047 కేసులు నమోదు
- రూ 72,77,445 లక్షలు జరిమానా

మంచిర్యాల అర్బన్, జనవరి 4 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ప్రమాదాల నివారణకు జాతీయ, రాష్ట్ర రహదారులపై నిర్ణీత వేగానికి మించివెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ శనివారం తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కమిషనరేట్ పోలీస్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నదని ఇందులో భాగంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై నిర్ణీత వేగానికి మించి వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా జాతీయ రహదారులపై ప్రతి రోజూ నిఘా ఉంచుతూ అధిక వేగంతో వెళ్లే వాహనాలపై కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తున్నామని తెలిపారు. రామగుండం కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో మూడు స్పీడ్ గన్ కెమెరాలు ఏర్పాటు చేసి గత సంవత్సరం కాలంలో 7047 కేసులు నమోదు చేసి రూ.72,77,445 లక్ష్యాలను జరిమానా విధించామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమిషనరేట్ వ్యాప్తంగా నిత్యం ప్రమాదాలు జరిగే 53 ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించినట్లు తెలిపారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా అధిక వేగంతో వెళ్లే వాహనాలపై చర్యలు తీసుకుటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులు నిభంధనలు పాటించాలని సూచనలు చేశారు.

జిల్లా స్థాయి పాటవ పరీక్ష పోటీలు

బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాగజ్‌నగర్, జనవరి 4: కాగజ్‌నగర్‌లోని పాత ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్ష నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందించి ప్రోత్సహించారు. కొత్తపల్లి వెంకటలక్ష్మి, చంద్రయ్య మొమోరియల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కొత్తపల్లి డాక్టర్ అనిత దంపతులు విద్యార్థులకు భోజన